క్లుప్తంగా

చెకుముకి టాలెంట్ టెస్ట్



ఆత్మకూరు: జనవిజ్ఞాన వేదిక ఆత్మకూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. పట్టణంతో పాటు మండలంలోని 22 పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షకు 1400 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలుత పట్టణంలోని మేధా పాఠశాలలో జేవీవీ నిర్వాహకులు ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించి ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. జేవీవీ కార్యవర్గ సభ్యులు ఎస్ మురళీకృష్ణ, మల్లికార్జున, హెచ్ హరికృష్ణ, జేవీవీ సీనియర్ నాయకులు షేక్ సందానీ, సాధిక్ హుస్సేన్, లక్కు ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రెజరీలో ఆడిట్

ఉదయగిరి: స్థానిక సబ్‌ట్రెజరీలో బుధవారం ఆడిట్ నిర్వహించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఆడిట్ బృందం అధికారులు మోషే, యుగంధర్, నరేంద్ర ప్రస్తుత ఆర్థిక సంవత్సర లావాదేవీల రికార్డులను తనిఖీ చేశారు.

29న మోడల్ టెట్

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో మోడల్ టెట్‌ను ఈ నెల 29న ఉదయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ మండల శాఖ నేతలు బుధవారం తెలిపారు. త్వరలో ప్రభుత్వం నిర్వహించనున్న ఏపీ టెట్‌కు హాజరుకానున్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్ష రాసేందుకు ఆసక్తి కలిగిన వారు శుక్రవారం సాయంత్రంలోగా 84640 09535 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తహసీల్దార్ స్వప్నకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆక్రమణలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించండి

ఉదయగిరి: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్ వైద్యసిబ్బందిని ఆదేశించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వార్డులు, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో వైద్యశాలలకు రోగుల తాకిడి అధికంగా ఉందన్నారు. వైద్య సిబ్బంది సమయాన్ని పాటించి రోగులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. వైద్యుల కొరత ఉన్న విషయాన్ని తెలుసుకుని త్వరలోనే తీరుస్తామన్నారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన వైద్యులు తిరిగి విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు



కావలి : డాక్టర్ డీఆర్ విశ్వోదయ బాలల దినోత్సవ సాంస్కృతిక పోటీలను డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జవహర్ భారతి కళాశాలలోని ఎంఎం హాల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి , ఆర్గనైజర్ జ్యోతిశ్రీ, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ మాల్యాద్రి పోటీలను పర్యవేక్షించారు. న్యాయనిర్ణేతలుగా నల్లూరు లక్ష్మీప్రశాంతి, కొప్పురావూరి లక్ష్మీగాయత్రి, నల్లూరు రామకృష్ణ వ్యవహరించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ఆత్మకూరు: సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ కావలి, ఆత్మకూరు విభాగాల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై బుధవారం విస్తృతంగా అవగాహన కల్పించారు. సార్డ్స్ సంస్థ పీఎం బెనోమి నేతృత్వంలో పట్టణంలోని ప్రియదర్శిని కళాశాల, నెల్లూరుపాళెంలో పాదుపు మహిళలు, ఆటో స్టాండ్ కార్మికులు, గిరిజన కాలనీల్లో అవగాహన కల్పించారు. సంస్థ సిబ్బంది కవితప్రియ, సునంద, పద్మజ, ధాన్యమాలిని, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

అల్లూరు: మండలంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ హజరత్ ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల అటెండెన్స్ యాప్‌లోని సాంకేతిక లోపాలను సరిచేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు చెంచయ్య, ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, మహేంద్ర కృష్ణ, మోహన్‌రావు, కృష్ణమూర్తి, గురవయ్య, సురేష్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

గ్రామదేవతల ఆలయాలే లక్ష్యంగా..

- వరుసగా చోరీలకు పాల్పడుతున్న దుండగులు
- సీసీకెమెరాలు ఉన్నా హుండీలను పగులగొట్టి నగదు అపహరణ
- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు



సంగంలోని గంగమ్మ ఆలయం వద్ద దొంగలు పగులగొట్టిన సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

సంగం: ఆత్మకూరు, సంగం పోలీసు సర్కిళ్ల పరిధిలోని గఆలయాలను లక్ష్యంగా చేసుకుని కొందరు దుండగులు వరుసగా చోరీలకు పాల్పడుతున్నారు. ఆలయ కమిటీల పర్యవేక్షణా లోపం, పోలీసుల నిఘా వైఫల్యంతో హుండీలను పగులగొట్టి నగదు అపహరిస్తున్నారు. సీసీకెమెరాల నిఘా ఉన్న ఆలయాల్లోనూ చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ప్రధానంగా గ్రామదేవతల ఆలయాలను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఆయా ఆలయాల్లోని హుండీలను పగులగొట్టి నగదు, ఇతర కానుకలను అపహరిస్తున్నారు. ఈ దొంగతనాలు ఎక్కువగా రాత్రి 12 గంటల నుంచి 2 గంటల ప్రాంతంలోనే జరుగుతున్నట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. గ్రామస్తుల ఫిర్యాదులతో పోలీసులు కేసులు నమోదు చేయడమే తప్పా దొంగల జాడను మాత్రం పట్టుకోలేకపోతున్నారు. సీసీకెమెరాల్లో దొంగల ఆనవాళ్లు రికార్డు అయినా ఇప్పటి వరకు పోలీసులు ఏ ఒక్కరిని అదుపులోకి తీసుకోకపోవడంతో ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

చోరీల కట్టడికి చర్యలు



"ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చోరీల కట్టడికి పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఆలయాల్లో జరిగిన దొంగతనాలకు సంబంధించి ఓ నిందితుడు సీసీ కెమెరాలో పట్టుబడ్డాడు. త్వరలోనే నిందితుడి వివరాలను వెల్లడిస్తాం. సీఐలు, ఎస్సైల ద్వారా ఆలయాల కమిటీలను అప్రమత్తం చేస్తున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

–కె వేణుగోపాల్, డీఎస్పీ, ఆత్మకూరు

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

- ఫిబ్రవరి 2న ఆత్మకూరు మండలం నల్లపరెడ్డిపల్లి గ్రామంలోని సాయిబాబా మందిరం, రామాలయం, అంకమ్మ ఆలయాల్లో హుండీలను దొంగలు పగులగొట్టి నగదు దోచుకెళ్లారు.
- ఫిబ్రవరి 20న సంగం మండలం అనుసూయనగర్‌లోని రెండు ఆలయాల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. రామాలయం, వినాయకుడి ఆలయాల తలుపులు పగులగొట్టి నగదు అపహరించుకెళ్లారు.
- మార్చి 20న అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్లలోని గంగమ్మ ఆలయంలోకి చొరబడి హుండీ పగులగొట్టి నగదు చోరీ చేశారు. పంచలోహ విగ్రహాల చోరీకి యత్నించి కుదరకపోవడంతో వెళ్లిపోయారు.
- మార్చి 20న మర్రిపాడు మండలం నందవరంలోని పోలేరమ్మ ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నా విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరీ దొంగలు చోరీకి పాల్పడ్డారు. దీంతో సీసీకెమెరాల్లో దొంగల ఆనవాళ్లు లభ్యం కాలేదు.
- మే 16న సంగంలోని పెన్నానది ఒడ్డున ఉన్న గంగమ్మ, పోలేరమ్మ ఆలయాల్లో సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన దొంగలు చోరీకి యత్నించి విఫలమయ్యారు.
- సెప్టెంబర్ 6న అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలోని తూమాలమ్మ, పోలేరమ్మ ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. హుండీలను పగులగొట్టి నగదు అపహరించడంతో పాటు మైక్‌సెట్‌ను తీసుకెళ్లి బయటపడేసి వెళ్లిపోయారు. అదే ఆలయంలో మూడు నెలల క్రితం కూడా దొంగలు చోరీకి పాల్పడడం విశేషం. ఇలా నెల, రెండు నెలలకు ఒకసారి నియోజకవర్గంలోని ఏదోక ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడుతున్నా ఇంతర వరకు వారి జాడను పోలీసులు కనిపెట్టలేకపోతుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి దొంగతనాలను అరికట్టకపోతే ఇదే అలుసుగా భావించి మరిన్ని ఆలయాల్లో దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంది.

కేఎస్సార్ ఫౌండేషన్ సేవలు విస్తృతం



వాటర్ ట్యాంకర్లను ప్రారంభిస్తున్న రాజారెడ్డి

అల్లూరు: కందల శివరామిరెడ్డి ఫౌండేషన్ సేవలను విస్తృతం చేస్తున్నామని ఆ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి పేర్కొన్నారు. తన తండ్రి కందల శివరామిరెడ్డి ఆరో వర్ధంతిని పురస్కరించుకుని కేఎస్సార్ ఫౌండేషన్ ద్వారా నగర పంచాయతీకి పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం ట్రాక్టర్ ట్రక్కును బుధవారం ఆయన అందజేశారు. అలాగే నగర పంచాయతీ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉచిత వాటర్ ట్యాంకర్లను ప్రారంభించారు. అల్లూరు రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాజారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తమ ట్రస్ట్ ద్వారా ఉచిత వైకుంఠ రథం, నిరుపేద మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం, ఉచిత డ్రైవింగ్ స్కూల్, ఉచిత భోజన వసతి, తదితర సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. ప్రస్తుతం ఉచిత వాటర్ ట్యాంకర్లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే ట్రస్ట్ సభ్యులకు తెలియజేస్తే ఉచితంగా సరఫరా చేస్తారని వివరించారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



పొలం పిలుస్తోందిలో పాల్గొన్న ఎమ్మెల్యే సురేష్

వరికుంటపాడు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వరికుంటపాడులో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల ముంగిటకు వ్యవసాయ సేవలను చేర్చడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు, వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేసి గ్రామసభ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి, ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓ రవికుమార్, ఎంపీడీఓ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్

ఆత్మకూరు: ఇటీవల బ్యాంకులు, ఏటీఎంల వద్ద చోరీలు చోటు చేసుకుంటున్నాయని, బ్యాంకర్లు సీసీ కెమెరాలతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవడం వంటి జాగ్రత్త చర్యలను పాటించాలని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో పట్టణంలోని 17 బ్యాంకుల మేనేజర్లు, ఫీల్డ్‌ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. సీఐ జీ గంగాధర్, ఎస్సై షేక్ జిలానీతో కలిసి బ్యాంకర్లకు భద్రతాపరమైన సూచనలు చేశారు. చోరీల నియంత్రణకు బ్యాంకు అధికారులు సహకరించాలని కోరారు. హోంశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక నుంచి అత్యవసర పరిస్థితుల్లో పోలీసు డయల్ 100కు బదులుగా 112కు కాల్ చేయాలని డీఎస్పీ సూచించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

ఉదయగిరి: సున్నంవారిచింతల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుమలాపురం గ్రామానికి చెందిన ఆలూరి వెంకటేశ్వర్లురెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఉదయగిరికి పని నిమిత్తం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా బైక్ అదుపుతప్పడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రుడ్ని 108 వాహన సిబ్బంది ఉదయగిరి సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం ఆత్మకూరుకు తరలించారు.

ముగిసిన స్కూల్‌గేమ్స్ పోటీలు



ఆత్మకూరు: కబడ్డీలో తలపడుతున్న బాలికలు



ఉదయగిరి: జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉదయగిరి నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు బుధవారంతో ముగిశాయి. మూడ్రోజుల పాటు హోరాహోరీగా సాగిన పోటీల్లో 300 మంది పాల్గొన్నారు. చివరి రోజు బాలికలకు యోగా, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. త్వరలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు విజేతలను పంపనున్నట్లు పీడీ ఎస్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. క్రీడా పోటీలకు న్యాయనిర్ణేతలుగా వెలుగోటి కృష్ణ, తిరుపాల్‌రెడ్డి, అంజయ్య, సుమలత, రజని విలాసిని, రమేష్‌రెడ్డి, రోశిరెడ్డి, వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 88 మంది ఎంపిక

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడ్రోజులుగా సాగుతున్న ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి అండర్–14, 17 స్కూల్‌గేమ్స్ పోటీలు బుధవారంతో ముగిశాయి. నియోజకవర్గ స్థాయి పోటీల్లో సత్తా చాటిన 88 మందిని జిల్లా పోటీలకు ఎంపిక చేసినట్లు కోఆర్డినేటర్ తిరుపతయ్య తెలిపారు. పీఈటీలు వెంకటకృష్ణ, సుమతి, గౌరీరెడ్డి, శైలజ, సరిత, రమేష్, హరనాథ్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వైద్యుడి మృతికి సంతాపం



గిరీష్ (ఫైల్)

చేజర్ల: చేజర్ల పీహెచ్‌సీలో సీనియర్ వైద్యుడిగా పనిచేస్తున్న ఎస్ గిరీష్(47) బుధవారం మృతి చెందారు. ఇటీవల ఇంట్లో కిందపడి తీవ్రంగా గాయపడి ఆయన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో కిడ్నీలు పాడై ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం వేకువన మృతి చెందారు. ఏడాది క్రితం చేజర్ల పీహెచ్‌సీకి వచ్చిన ఆయన మంచి వైద్యుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన మృతిపై వైద్య సిబ్బంది, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

పోలీసు అవుట్‌పోస్టును పునరుద్ధరించండి



కావలి : కావలి నూతన డీఎస్పీ పీ శ్రీధర్‌ను ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఇటీవల కావలి బస్టాండ్‌లో జేబు, సెల్‌ఫోన్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, తాము సీసీ కెమెరాల ఏర్పాటుకు యత్నిస్తున్నామని, తమ వంతుగా డిపో ప్రాంగణంలోని పోలీస్ అవుట్‌పోస్ట్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. బస్టాండ్ వద్ద ప్రైవేట్ వాహనాల నియంత్రణకు సహకరించాలని కోరారు. స్పందించిన డీఎస్పీ తమ వంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించాలి

ఆత్మకూరురూరల్: వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మండలంలోని మహిమలూరులో బుధవారం జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదలందరికీ ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వం కలిస్తున్న సౌకర్యాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయన బసవరాజుపాళెం, మహిమలూరు, కోటపాడులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. మహిమలూరు సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, వైఎస్ఎంపీపీ ఉద్దాల పెంచలరావు, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ జేఏసీ ఫిర్యాదు

ఉదయగిరి: క్రైస్తవులు మనోభావాలు దెబ్బతినేలా ఏసుక్రీస్తు, బైబిల్, పాస్టర్లను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని పాస్టర్లు కోరారు. ఈ మేరకు క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయగిరి సీఐ వెంకట్రావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. శివశక్తి సంస్థ అధ్యక్షుడు కరుణాకర్, సుగుణ, రాధామనోహర్‌దాస్, చాటపల్లి కళ్యాణ్ చక్రవర్తి, తదితరులు సామాజిక మాధ్యమాల్లో ఏసుక్రీస్తు, బైబిల్, పాస్టర్లను అసభ్య పదజాలంతో దూషిస్తూ క్రైస్తవుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడినందున వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాస్టర్లు ఆరోన్, జాషువా, వై.రవికుమార్, చెంచయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

- కలెక్టర్ ఆనంద్



సీతారామపురం: విద్యార్థులకు పాఠం చెబుతున్న కలెక్టర్ ఆనంద్

సీతారామపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. సీతారామపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పదో తరగతి విద్యార్థులకు పాఠం చెప్పి సమాధానాలు రాబట్టారు. నోట్ పుస్తకాలను పరిశీలించారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, నాణ్యతా ప్రమాణాలను ఎంఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పరిశీలించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన తరగతి గదులను పరిశీలించి త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం బెస్తకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించి వారి ఎత్తు, బరువులను నిశితంగా పరిశీలించారు. అనంతరం పబ్బులేటిపల్లిలో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. పంటల సాగులో మెళకువలు, మేలైన విత్తనాల సేకరణ, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, దిగుబడులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

హైవే బాధిత రైతులకు న్యాయం చేస్తాం

సింగారెడ్డిపల్లి, నాంచారమ్మపల్లి, సంగసానిపల్లి గ్రామాలకు చెందిన హైవే బాధిత రైతులతో కలెక్టర్ మాట్లాడారు. తమకు ప్రభుత్వం ఎకరాకు రూ.5.40 లక్షలను పరిహారంగా అందజేస్తోందని, తమ పొలాలను ప్రైవేట్‌గా అమ్ముకుంటే ఎకరాకు రూ.20 లక్షలకుపైగా వస్తోందని రైతులు మొరపెట్టుకోగా కలెక్టర్ స్పందించారు. బాధితులు ఆర్బిటేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామన్నారు. బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లింపుల విషయంలో న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆత్మకూరు ఆర్డీఓ మధులత, తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డి, ఉదయగిరి సీడీపీఓ పచ్చవ లావణ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవీ రెడ్డి, ఎంఈఓ మస్తాన్‌వలి, ఏఓ చెన్నారెడ్డి, హౌసింగ్, పీఆర్ ఏఈలు రామకృష్ణారావు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను సాధించాలి

ఉదయగిరి: ఉపాధి లక్ష్యాలను నెల రోజుల్లో 50శాతం సాధించాలని, లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి, దుత్తలూరు మండలాల ఉపాధి సిబ్బందితో బుధవారం కలెక్టర్ సమీక్షించారు. పంచాయతీల వారీగా సమీక్షించి లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఉదయగిరి ప్రాంతంలో బీడు భూములు ఎక్కువగా ఉన్నందున ఉపాధి కింద పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు సంబంధించిన 90 రోజుల పని దినాలను వెంటనే పూర్తిచేయాలన్నారు. కాగా దుత్తలూరు మండలం కొత్తపేటలో ఉపాధి పనుల్లో బినామీ మస్టర్లు నమోదుచేసి నిధులు కాజేస్తున్నారని ఆధారాలతో సహా రైతు సంఘం మండల కార్యదర్శి పచ్చవ వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే కొత్తపేట వెళ్లి విచారణ జరపాలని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసులును ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఇన్‌చార్జి డ్వామా పీడీ బీ శ్రీనివాసులు, ఆత్మకూరు ఆర్డీఓ మధులత, ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీడీఓలు శ్రీనివాసరాజు, సంధ్యాలక్ష్మి, ఏపీఓలు శ్రీనివాసులు, బ్రహ్మయ్య, ఈసీ వెలుగోటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌తో పార్వతమ్మకు విడదీయరాని అనుబంధం



కావలి: పార్వతమ్మకు నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు



పార్వతమ్మకు నివాళి అర్పిస్తున్న రామిరెడ్డి

కావలి : రెడ్‌క్రాస్‌తో కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మకు విడదీయరాని అనుబంధం ఉందని కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్ పేర్కొన్నారు. కావలిలోని రెడ్‌క్రాస్ భవనంలో పార్వతమ్మ చిత్రపటానికి రెడ్‌క్రాస్ ప్రతినిధులు, సిబ్బంది బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాల విస్తరణకు మాగుంట కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. నెల్లూరు, కావలిలో రెడ్‌క్రాస్ రక్తనిల్వ కేంద్రాల ఏర్పాటుకు పార్వతమ్మ భూరి విరాళాలను అందజేశారని తెలిపారు. నెల్లూరులో మాగుంట సుబ్బారామిరెడ్డి మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కావలి, కనిగిరి రెడ్ క్రాస్ శాఖలకు అంబులెన్స్‌లను అందజేశారని తెలిపారు. పార్వతమ్మ మరణం రెడ్‌క్రాస్‌కు తీరని లోటు అని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు కలికి శ్రీహరిరెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, కే హరినారపరెడ్డి, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి నివాళి

కావలి మాజీ ఎమ్మెల్యే, ఒంగోలు ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతి తీరని లోటని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని నివాసంలో మాగుంట పార్వతమ్మ భౌతికకాయాన్ని బుధవారం రాత్రి ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యేగా పార్వతమ్మ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించి మన్ననలు పొందారని గుర్తుచేశారు. ఆమె మరణం బాధాకరమని, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. ఆయన వెంట కావలి నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

పార్వతమ్మ మృతిపై సంతాపం

కలిగిరి: కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతిపై జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, నాయకుడు పాలూరు కొండారెడ్డి బుధవారం సంతాపం తెలిపారు. 2004–2009 వరకు కావలి ఎమ్మెల్యేగా పార్వతమ్మ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో సోమశిల ఉత్తరకాలువను మంజూరు చేయించి మెట్టప్రాంత రైతులకు సాగునీరు, కందుకూరు ప్రాంతానికి తాగునీటిని అందించిన ఘనత పార్వతమ్మదేనన్నారు. పార్వతమ్మ మృతి తీరనిలోటని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



మంచినీటిని అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి మెట్ట ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చి వీపీఆర్ ఫౌండేషన్ అమృతధార ద్వారా వీలైనన్ని ఎక్కువగా మినరల్ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వింజమూరు మండలం జీబీకేఆర్ ఎస్టీ కాలనీ, సాతానువారిపాళెంలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్లను ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం బుక్కాపురంలో జరిగిన మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత వింజమూరు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం డైనింగ్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా ఎంపీ సానుకూలంగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు జీ రఘు, యన్నం రామచంద్రారెడ్డి, జూపల్లి రాజా, వనిపెంట సుబ్బారెడ్డి, అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, గూడా నరసారెడ్డి, గణపం సుదర్శన్, మన్నేటి వెంకటరెడ్డి, చేజర్ల భాస్కర్‌రెడ్డి, ఆంధ్రా బాలగురవారెడ్డి, బోగినేని శ్రీనివాసులు, చంద్రా మధు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి



సంగంలో: దీన్‌దయాళ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

దుత్తలూరు/మర్రిపాడు/సంగం/చేజర్ల: ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో పండిట్ దీన్‌దయాళ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. దుత్తలూరులో బీజేపీ మండలాధ్యక్షుడు చుండి హరిగోపాల్, మర్రిపాడు మండలం చిన్నమాచనూరులో ఆత్మకూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి, చేజర్లలోని బీజేపీ కార్యాలయంలో మండల నాయకుడు జీ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంగంలోని ఇరిగేషన్ అతిథిగృహంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కాకు విజయలక్ష్మి పాల్గొని దీన్‌దయాళ్ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సాగులో రైతులకు అండగా నిలవాలి

ఉదయగిరి/అనుమసముద్రంపేట/సంగం/చేజర్ల: సాగులో రైతులకు అండగా నిలవాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి కోరారు. ఉదయగిరిలోని వ్యవసాయ కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గ వ్యసాయాధికారులు, సిబ్బందితో బుధవారం ఆమె సమీక్షించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ సిబ్బంది రైతుకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓ ఆంజనేయులునాయక్, ఏఈఓలు బోగ్యం సుధీర్, రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. ఏఎస్‌పేట మండలం పెద్దబ్బీపురం, రాజవోలు గ్రామాల్లో ఏఓ రజనీ ఆధ్వర్యంలో విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం, మిత్ర పురుగుల సంరక్షణపై అవగాహన కల్పించారు. సంగంలో ఏఓ శ్రీహరి రబీ సీజన్‌లో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి యాజమాన్యంపై సూచనలు చేశారు. మాముడూరు, తూర్పుపల్లిలో ఏఓ శశిధర్ ఎరువుల యాజమాన్యం, సీసీఆర్ కార్డులు, భూసార పరీక్షలు, జీవన ఎరువులు, పీఎం కిసాన్‌పై అవగాహన కల్పించారు.